ఎంపీ ఈటలను కలిసిన నాయకులు



ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీఏ సభ్యులు

మేడ్చల్ రూరల్: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను సోమవారం మేడ్చల్ అగ్రిప్రొఫెషనల్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఎంపీపీఏ అసోసియేషన్ అధ్యక్షులు రవి ఆధ్వర్యంలో మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఆయనను కలిసి సన్మానించారు. అసోసియేషన్ భవనం ఏర్పాటుకు కృషి చేయాలని వినతిపత్రం అందజేసి కోరారు.

కీసరగుట్టలో ప్రత్యేక పూజలు



కీసరగుట్ట దేవాలయం వద్ద భక్తుల రద్దీ

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఏకాదశి సందర్భంగా స్వామివారికి వేదపండితులు విశేషపూజలను నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం పూజను ,అనంతరం క్షీరాభిషేకం పూజలను కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం ఏకాదశి సందర్భంగా పెద్ద ఎత్తున వివిధప్రాంతాలనుండి భక్తులు కీసరగుట్టస్వామి దర్శనానికి విచ్చేసారు. ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగం, వంశపారంపర్యధర్మకర్తలు తటాకం రమేష్, తటాకం నారాయణ,తటాకం వెంకటేష్, తటాకం ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



శివాన్ష్ చౌబే (ఫైల్)

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ మురళీధర్ తెలిపిన మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం దర్వారీ గ్రామానికి చెందిన సంఘం కుమార్ చౌబే కుటుంబం మేడ్చల్‌లో నివాసముంటోంది. అతని కుమారుడు శివాన్ష్ చౌబే(18) ఈ నెల 1న శివాన్ష్ చౌబే స్వగ్రామానికి వెళ్లిపోతానని తండ్రికి తెలిపాడు. రైలు టిక్కెట్ దొరక్కపోవడంతో రెండు రోజుల తర్వాత ఇంటికి వెళ్లాలని తండ్రి కుమార్ చౌబే కుమారుడికి చెప్పాడు. కాగా ఈ నెల 14న తెల్లవారుజామున ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిన శివాన్ష్ తిరిగి ఇంటికి రాకపోవడంతో స్వగ్రామానికి చెప్పకుండా వెళ్లి ఉండవచ్చని భావించి బంధువులను ఆరా తీయగా అక్కడికి చేరుకోలేదు. దీంతో తమ కుమారుడు తప్పిపోయాడని తండ్రి మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోశాల నిర్మాణానికి స్థలం కేటాయించాలి

ఉప్పల్: తపస్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తపస్య ఫౌండేషన్ ప్రతినిధులు ఆచార్య వేద సింధు, బొల్లా విజయ్‌కుమార్ తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో మహేందర్ జైస్వాల్, పత్తిపాక లక్ష్మణ్, గంగాధర్ మహాజన్ తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం

రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని అంబేడ్కర్ కమిటీ హాల్‌లో సోమవారం వనిత జీవన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు ప్రారంభించారు. మహిళలు తమ ఇంటి వద్దే స్వయం ఉపాధిని చేపట్టి మరో 10 మంది మహిళలకు ఉపాధి కల్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ఆకుల సుభాషిని, అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు జంగయ్య, బొడ్డుపల్లి ఆనంద్, కొంగర శ్రీనివాస్, నిరంజన్‌గౌడ్, అంజయ్య, మల్లికార్జున్, లత తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ..

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ జిల్లా పరిషత్ పాఠశాలలో 2007–2008 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ప్రధానోపాధ్యాయులు నర్సింహారెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి హాజరై నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'పనులు కాకముందే కాంట్రాక్టర్‌కు నిధులు ఎలా చెల్లిస్తారు?'

నిజాంపేట్: ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి కాకముందే కాంట్రాక్టర్‌కు నిధులు ఎలా చెల్లిస్తారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని పాపయ్యకుంట నుండి సిరిబాలాజీ లేఅవుట్ వరకు రూ.2.1 కోట్ల నిధులతో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులను బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 9 చోట ఎస్ఎన్‌డీపీ పనులను రూ. 84 కోట్లతో చేపట్టినా ఇంత వరకు ఐదు ప్రాంతాల్లోనే పూర్తి చేసి మరో నాలుగు చోట్ల పెండింగ్ పెట్టారన్నారు. సరుద కాంట్రాక్టర్ స్థానిక ఎమ్మెల్యే సమీప వ్యక్తి కావడంతో పనులు పూర్తి చేయకున్నా అధికారులు రూ.30 కోట్ల బిల్లులు చెల్లించారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బాచుపల్లి కౌసల్య కాలనీ వద్ద నాసిరకం పనులు చేపట్టారని, రిటైనింగ్ వాల్‌ను భూమికి సమాంతరంగా నిర్మించలేదని, అదే విధంగా పెద్ద చెరువు వద్ద ఎస్ఎన్‌డీపీ నాలాకు కనీసం కనెక్టివిటీ ఇవ్వకుండా పనులు ఏ చేస్తున్నారని ఆరోపించారు. ఈ పనులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

యూరో కిడ్స్ ప్రీ స్కూల్ ప్రారంభం

అల్వాల్: అల్వాల్ ప్రశాంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన యూరో కిడ్స్ ప్రీ స్కూల్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ బండి అక్షితరెడ్డి హాజరై ప్రారంభించారు. రామిరెడ్డి, శ్రీకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, నక్క ప్రభాకర్‌గౌడ్, యాదగిరి, సురేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, బలవంతరెడ్డి, రాజసింహారెడ్డి పాల్గొన్నారు.

జవహర్‌నగర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



ఘనంగా బక్రీద్

మేడ్చల్: త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండగను మేడ్చల్ మండలంలో సోమవారం జరుపుకున్నారు. ఉదయం మజీద్‌లు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ బంధవులకు స్థోమతను బట్టి దానాలు చేశారు. నాయకులు ముస్లిం నేతల ఇళ్లకు వెళ్ళి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

ఘట్‌కేసర్: ఉమ్మడి ఘట్‌కేసర్ మండలంలో బక్రీద్ పర్వదినం సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బైపాస్ సర్వీస్ రోడ్డు వద్ద గల ఈద్గా వద్ద ముస్లింలు సామూహిక ప్రార్ధనలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, జహంగీర్ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అన్సూ, ఖలీల్, సిరాజ్, అయూబ్ పాల్గొన్నారు.

కీసర: నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతా గౌడ్, వైస్ చైర్మెన్లు మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బండారి మల్లేష్ యాదవ్, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ఎంపీపీ జలాల్‌పురంసత్తిరెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీసభ్యులు, మాజీ సర్పంచులు, ముస్లీంలకు బక్రీద్‌పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ముస్లిం సోదరులు ఆదివారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం ఈద్గాకు వెళ్లి ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఘట్‌కేసర్‌లో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులు, నర్సింగ్‌రావు

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని సత్యానగర్, రవీందర్‌నగర్, లక్ష్మీకాంతనగర్, శ్రీనగర్ కాలనీల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా వంటి కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, అదేవిధంగా రామంతాపూర్‌లోని కొత్త బస్తీలు, కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు త్వరలో అధికారులతో కలిసి విస్తృత సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సూరం శంకర్, ప్రశాంత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, విజయలక్ష్మీ, మధు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ మార్చ్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ స్టూడెంట్ ప్రతినిధులు

కాప్రా: నీట్ పరీక్ష నిర్వహణలో విఫలం చెంది, పరీక్ష ఫలితాల్లో లీకేజీలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టూడెంట్ మార్చ్ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యాప్రసాద్ మాట్లాడుతూ నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలన్నారు. నీట్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్ నుంచి లిబర్టీ అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు గిరిబాబు, శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

శారదాచంద్రమౌళీశ్వరాలయం 18వ వార్షికోత్సవం

మల్కాజిగిరి: మల్కాజిగిరి గీతానగర్‌లోని శారదాచంద్రమౌళీశ్వరాలయం 18వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం గోపూజ అనంతరం, మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం, అలంకరణ, శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు.

నేడు రైతు నేస్తం కార్యక్రమం

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి రైతు వేదిక వద్ద రైతు నేస్తం (వీడియో కాన్ఫరెన్స్) కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి తెలిపారు. వానాకాలం వరి సాగు గురించి ఉత్తమ రైతులు, శాస్త్రవేత్తలు సాగు మెలకువల గురించి వివరిస్తారన్నారు. మండలంలో రైతులు పాల్గొన్ని సద్వినియోగం చేసుకొవాలని ఆమె సూచించారు.

కబ్జాదారునిపై కేసు నమోదు

పోచారం: ఖాళీ స్థలాన్ని కబ్జాచేసిన వ్యక్తిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీం రాజు తెలిపిన మేరకు.. అన్నోజీగూడలోని సత్యసాయినగర్ సర్వే నెంబర్ 44లో 100 చదరపు గజాల స్థలాన్ని బోడుప్పల్ కార్పొరేషన్‌లోని దేవేందర్‌నగర్‌కు చెందిన బండ శ్యామల లత 2013లో కొనుగోలు చేశారు. అయితే పక్క ప్లాటు యజమాని సురేష్ తన ప్లాటులో 60 చదరపు గజాల స్థలాన్ని కబ్జాచేసి నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. తన ప్లాటును ఎందుకు ఆక్రమించారని అడిగితే 'అలాగే ఆక్రమించి కట్టుకుంటా. ఏమి చేస్తావ్.. ఎవరితో చెప్పుకుంటావ్' అని బెదిరించాడని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

సమస్యల పరిష్కారానికి కృషి

బోడుప్పల్: సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలో సోమవారం ఆమె పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యోతినగర్ కాలనీలో కరెంట్ సమస్యలు, సీసీ రోడ్డు సమస్యలున్నాయని కాలనీవాసులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు వేగంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

మధ్యాహ్న భోజనం.. మరింత బలవర్ధకం

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు
- ఇద్దరి చొప్పున రాష్ట్ర స్థాయిలో అవగాహన కల్పించిన విద్యాశాఖ
- జిల్లా స్థాయిల్లో పాఠశాల హెడ్మాస్టర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకూ పూర్తయిన శిక్షణ.
- గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లోని సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య 3.64 లక్షలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య

జిల్లా	ప్రభుత్వ పాఠ శాలలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	631	1,08,635
మేడ్చల్–మల్కాజిగిరి	505	90,301
రంగారెడ్డి	1301	1,65,203
మొత్తం	2,497	3,64,139

సాక్షి, మేడ్చల్ జిల్లా: పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టిన ప్రభుత్వం బలవర్ధకమైన పోషకాహారం ఉండేలా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులకు మరింత నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించే లక్ష్యంతో విద్యాశాఖ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఏటా మార్పులు తెస్తూ.. ఇప్పటికే కోడిగుడ్లు, ఆకుకూరలు, పోషకాలు ఉంటే కిచిడీ తదితర మెనూ ప్రవేశపెట్టింది. అయితే.. వంటావార్పులో సరైన శిక్షణ లేక చిన్నచిన్న పొరపాట్లతో విద్యార్థులకు పోషకాలు అందకుండా పోతున్నాయని గ్రహించిన ప్రభుత్వం జాతీయ స్థాయిలో అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. అందులో భాగంగా ఇప్పటికే ప్రతి జిల్లా నుంచి ఇద్దరు భోజన కార్మికులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అలాగే, జిల్లా స్థాయిలో మిగతా వారందరికీ కూడా శిక్షణ పూర్తవటంతో ...విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంపైన్నే దృష్టి సారిస్తున్నారు.

- నగరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని ఇద్దరు మధ్యాహ్న భోజన కార్మికులతోపాటు ఇద్దరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ వంట చేయడంలో ప్రావీణ్యులతో అవగాహన కల్పించగా, వారు స్థానికంగా ఉన్న వాందరికి శిక్షణ ఇచ్చారు. బియ్యం పలుమార్లు కడగడం, కూరగాయలు కోసిన తర్వాత కడగడం వల్ల ఇందులో ఉండే పోషకాలు, ఖనిజాలు నష్ట పోతుండటం వల్ల తీసుకోవాల్సిన 11 జాగ్రత్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామాల్లో లభించే మునగ, తోటకూర, ఆకుకూర, కరివేపాకు, గోంగూర వంటి వాటిని ఎక్కువగా ఎలా ఉపయోగించే విషయంపై అవగాహన కల్పించారు. వంట చేసే ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కార్మికుల వ్యక్తిగత శుభ్రత, నీరు, సామగ్రి, పరిసరాల పరిశుభ్రత, వడ్డనపై అవగాహన కల్పించారు.

పోషక విలువలపై దృష్టి ..

వంట నిపుణులు పేర్కొన్న పద్ధతుల ప్రకారం వంట చేయడం వల్ల పోషకాలు నష్టపోకుండా ఉంటాయని శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. . పోషకాహార లోపం వల్లే చాలా మంది పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని, వంట నిపుణులు చెప్పిన అంశాలు, జాగ్రత్తలు పాటిస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరిస్తున్నారు. పాఠశాలల్లో బలవర్ధకమైన ఆహారం విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంటామంటున్నారు.

పూర్తయిన శిక్షణ.. పోషకాహారంపైన్నే దృష్టి

రాష్ట్ర వ్యాప్తకంగా జిల్లాకు ఇద్దరికి మాత్రమే శిక్షణ ఇచ్చారు. వీరితో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇప్పించాం. ప్రధానోపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ.. పోషకాహారం అందించేలా చూడాలని ఆదేశించాం.

–ఐ.విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మేడ్చల్ జిల్లా

బైండ్ల కులాన్ని మూడో ఉప కులంగా గుర్తించాలి



బైండ్ల కులస్తుల సమావేశం

శామీర్‌పేట్: ఎస్సీల్లో మాల, మాదిగ ఉపకులాలతో పాటు బైండ్ల కులాన్ని మూడవ ఉప కులంగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి రాంచందర్ అన్నారు. శామీర్‌పేట మండలం, అలియాబాద్ సంగీత్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం బైండ్ల కులస్తుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా బైండ్ల కుల సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా షెడ్యూల్ (ఎస్సీ) కులాలను మాల, మాదిగ ఉపకులాలుగా పిలుస్తున్నట్లే బైండ్ల కులాన్ని కూడా గుర్తించాలని కోరారు. ఎస్సీ కులాల్లో ప్రస్తుత రిజర్వేషన్ 15 నుంచి 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా బైండ్ల రాంచందర్, ఉపాధ్యక్షుడిగా బైండ్ల శంకర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా నర్సింహులును ఎన్నుకున్నారు.

కాలనీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు



నూతన భవన నిర్మాణపనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మెన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపల్‌పరిధిలోని వివిధ కాలనీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడతామని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని సత్యనారాయణకాలనీలో కాలనీనూతన భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కాలనీల్లో అసోషియేషన్ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.సత్యనారాయణ దేవస్థానం చైర్మెన్ అన్నంరాజు శ్రీనివాస్, సత్యనారాయణ కాలనీ అసోషియేషన్ అధ్యక్షుడు మధుసుధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్



గజమాలతో సన్మానిస్తున్న సీనియర్ నాయకుడు శ్రీనివాస్ ముదిరాజ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎంపీగా గెలిపించిన ప్రజలకు అండగా ఉంటానని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత మొదటిసారి మల్కాజిగిరిలో సఫిల్‌గూడ మినీట్యాంక్ బండ్‌ను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అభినందనలు తెలిపి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అనుగుణంగా ప్రభుత్వ పనితీరు ఉండాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రులతో సైతం కొట్లాడిన సంఘటనలు ఉన్నాయన్నారు. చెరువులు ఒకప్పుడు కలుషితం లేకుండా అందరికీ ఉపయోగకరంగా ఉండేవని, ఇప్పుడు మళ్లీ ఆ పరిస్థితులు రావాలన్నారు. ఆనంద్‌బాగ్ ప్రాంతంలో ఎంఎంటీఎస్ రైల్వే స్టాపింగ్ కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మొదటిసారి మల్కాజిగిరికి వచ్చిన ఈటల రాజేందర్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

నాణ్యత పాటించకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు



ఉప్పల్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత తదితరులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు. కుమ్మరిబస్తీలో రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లేకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కాలనీల్లో నెలకొన్న వివిధ సమస్యలను కాలనీ అసోసియేషన్ల నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుమ్మడెల్లి శంకరయ్య, కృష్ణ, బుల్లెట్ కృష్ణ, మీనంపల్లి ఆండాలు, సల్ల ప్రభాకర్‌రెడ్డి, మాశెట్టి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐలో యూనియన్ ఆవిర్భావ వేడుకలు



నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో యూనియన్ ఆవిర్భావ వేడుకల్లో ఉద్యోగులు

మల్లాపూర్: తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఇప్పటి వరకు యూనియన్ చేపట్టిన పోరాటాలు, ఉద్యమాలను గుర్తుచేశారు. ఉద్యోగుల హక్కుల సాధనం కోసం తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ విజయాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ భాగ్యలక్ష్మీ, హెడ్‌నర్సు రాజమణి, ఈఎస్ఐ బ్రాంచ్ సెక్రటరీ వేణుకుమార్, ధన్‌రాం, భాగ్య, సౌందర్య, బాకేశ్వరీ, జామియా, కుమార్, రాఘవేంద్రర్, అరుణ, ఈఎస్ఐ ఆస్పత్రి సిబ్బంది, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

'నీట్' అవకతవకల ఆరోపణలపై ప్రధాని స్పందించాలి

బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్



కుత్బుల్లాపూర్: ఇటీవల నిర్వహించిన నీట్ ఎంట్రన్స్‌లో అవకతవకల ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ కోరారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షా పేపర్ లీకై న అంశంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. తమ పిల్లలు డాక్టర్లు అవుతారని కలలుగన్న తల్లిదండ్రుల ఆశయాలను గందరగోళానికి గురి చేశారన్నారు. బిహార్ రాష్ట్రంలో రూ.30లక్షలకు నీట్ ప్రశ్నాపత్రాలు విక్రయించారని, అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికీ కేంద్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి..

ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే స్పందించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నీట్ పరీక్షలో గతంలో ఎప్పుడు లేని విధంగా ఒకే ర్యాంకు 67 మందికి ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఒకే గదిలో 720కి 720 మార్కులు 8 మందికి ఎలా వస్తాయనే ప్రశ్న ఉత్పన్నమవుతుందని పేర్కొన్నారు. ఈ మార్కులు సాధించడం చూస్తే పేపర్ ఏ విధంగా లీక్ అయిందో అందరికీ అర్థం అవుతుందని అన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ విషయంపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ దశరథం, రాష్ట్ర కార్యదర్శి రాజేష్, వివిధ జిల్లాల అధ్యక్షులు అశోక్, నరేష్, రంగు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.